ఓంశ్రీసాయిరాం

సర్వరూపధరం శాంతం సర్వనామధరం శివమ్।

సచ్చిదానంద మద్వైతం సత్యంశివంసుందరమ్॥

ప్రేమస్వరూపులారా! రెండు దినములనుండి మీరందరూ ఎంతో శ్రమలకోర్చి ఇక్కడ కూర్చొని, అన్ని విషయములను చక్కగా వింటూవచ్చారు. ఎంత దూరమునుండియో వచ్చి, ఎంతో వ్యయప్రయాసలకోర్చి మీరు ఈ సమావేశంలో పోల్గొనటం మీ పవిత్రమైన హృదయానికి సాక్ష్యం. లోకంలో ఉన్న కోట్లాది జనులలో కొద్దిమందికి మాత్రమే ఇట్టి అవకాశము లభిస్తుంది. ఇది చాలా గొప్ప అదృష్టం.

మీరిక్కడికి వచ్చినందుకు ముఖ్యంగా తెలుసుకోవలసిన విషయమేమిటి? లోకంలో కొన్ని లక్షల స్కూల్సు ఉన్నాయి, కొన్ని లక్షల కాలేజీలు ఉన్నాయి. అవి ఎన్ని ఉండినప్పటికీ మీరు మొట్టమొదట మీ హృదయమనే కాలేజియొక్క స్వభావాన్ని అర్థంచేసుకోవాలి. అందులోనున్న సత్యం, ధర్మం, శాంతి, ప్రేమ, అహింస అనేటువంటి ఐదు విలువలను అలవరచుకోవాలి. అప్పుడే మీరు నిజమైన విద్యావంతులు కాగలరు. లోకంలో ఎంతమందో లాయర్సు ఉన్నారు, పెద్దపెద్ద గ్రంథాలు చదువుతున్నారు. కాని, ఎన్ని చదివినప్పటికీ వారుకూడా లయర్సుగా తయారైతే ప్రయోజనమేమిటి! ఎంతమందియో డాక్టర్లు ఉంటున్నారు. కాని, ఒక డాక్టరుకు మరొక డాక్టరుకు మధ్య యూనిటీ కనిపించటం లేదు. మొట్టమొదట మీరు సాధించవలసినది యూనిటీ. అందరూ బ్రదర్స్ అండ్ సిస్టర్సే! తండ్రి ఒక్కడే, ఆయనే భగవంతుడు. మనమంతా ఆ తండ్రియొక్క బిడ్డలమనే సత్యాన్ని మీరు హృదయంలో స్థిరంచేసుకోవాలి. బిడ్డలలో చిన్నచిన్న లోపాలు ఉండవచ్చు. ఒకరినొకరు అర్థం చేసుకొని అడ్జస్ట్ చేసుకోవాలి. అండర్‌స్టాండ్ చేసుకుంటే అడ్జస్ట్‌మెంట్ సులభమైపోతుంది. స్వామి ఎంతో ప్రేమతో మీ మంచికోసమే ఇవన్నీ బోధిస్తున్నాడు అనేటువంటి సత్యాన్ని మీరు మొట్టమొదట గుర్తించండి.

ఈనాడు సైన్సు దినదినాభివృద్ధినొందుతున్నాది. కాని, సైంటిస్టులు చేసే పరిశోధనలన్నీ కేవలం ఇంద్రియాలయొక్క పరిధిలోనివి కనుక, వాటిలో చాలా తప్పులు జరుగుతున్నాయి. ఈనాటి సైంటిస్టులవల్ల సమాజమునకు ఉపకారముకంటె ఎక్కువ అపకారమే జరుగుతున్నాది. హెల్ప్ చేస్తున్నామని అంటున్నారేగాని, నిజానికి ఎన్నోవిధాలుగా హర్ట్ చేస్తున్నారు. తత్ఫలితంగా ఈనాటి మానవుడు భయభ్రాంతులతో జీవించవలసివస్తోంది. ఒక ఏరోప్లేన్ ఎక్కాలంటే భయమే! ఒక చిన్న ఎలుకను చూచినా భయమే! ఈ భయం వల్ల అనేకవిధములైన భ్రాంతులు అభివృద్ధి అవుతున్నాయి. కనుక, మనం దేనికీ భయపడకూడదు. కాని, ఇప్పుడు కూరగాయలు తినాలన్నా భయమే! పళ్ళు తినాలన్నా భయమే! వాటివల్ల ఏ జబ్బులు వస్తాయో ఏమిటో! ఎందుకంటే ఇవన్నీ మందులతో తయారౌతున్నాయి. మనం తినే తిండి, త్రాగే నీరు, పీల్చే గాలి అన్నీ కలుషితమైపోతున్నాయి. ఇటువంటి పరిస్థితిలో మన ఆరోగ్యాన్ని ఎట్లా కాపాడుకోగలము? కనుక, మనం ఈ పొల్యూషన్ లేకుండా చేసుకోవాలి. రుచికోసమని తినరాని పదార్థాలు తిని ఆరోగ్యాన్ని పాడుచేసుకోకూడదు. మీరు ఆరోగ్యాన్ని కాపాడుకుంటే మీకు ఆరోగ్యవంతులైన పిల్లలు పుడతారు. పిల్లలకు శారీరక ఆరోగ్యముతోబాటు మానసిక వికాసాన్ని అందించే నిమిత్తం వారిని బాలవికాస్‌లో చేర్చి సద్బోధలు చేయాలి.

ఎటువంటి పరిస్థితియందైనా సత్యాన్నే పలకండి. అంతేకాదు, మిమ్మల్ని ఎవరేమని నిందించినా మీరు శాంతంగా ఉండండి. పూర్వం ఋషులంతా మౌనం పాటించేవారు. సాధన ఫలవంతం కావటానికి మౌనం చాలా దోహదపడుతుంది. సత్యాన్ని అనుసరించినప్పుడే మనకు శాంతి చేకూరుతుంది. అందులోనుంచి పవిత్రమైన ప్రేమ ఆవిర్భవిస్తుంది. ఎప్పుడు మనలో ప్రేమ ఆవిర్భవిస్తుందో అప్పుడు మనకు శత్రువులే ఉండరు. నిజానికి మనం ఎవరినీ శత్రువులుగా భావించకూడదు. అందరిపట్ల ప్రేమతో జీవించటానికి ప్రయత్నించాలి. లోకశాంతికి ప్రేమ ఒక్కటే మార్గం. ఈనాడు అందరూ పీస్, పీస్ అంటున్నారుగాని, ఎక్కడా పీస్ లేదు. అంతా పీసెస్, పీసెస్. అన్నింటినీ ముక్కలు చేస్తున్నారు. దేశాన్నికూడా ముక్కలు చేస్తున్నారు. నీవు విదేశాలకు వెళ్ళినప్పుడు 'ఎక్కడనుంచి వచ్చావు?' అని ఎవరైనా అడిగితే నీవు విశాలమైన భావంతో, 'నేను ఇండియానుంచి వచ్చాను' అని చెప్పాలి. అంతేగాని, సంకుచితమైన భావంతో నీ గ్రామంపేరు, జిల్లా పేరు ఇవన్నీ చెప్పుకుంటూ పోకూడదు. విశాలమైన భవాలతో మనం జీవించాలి. అటువంటి భావాలు కలగటం చాలా అదృష్టం.

మనలో విశాలమైన భావాలు పెంచుకున్నప్పుడు పిల్లలలోకూడా విశాలమైన భావాలు అభివృద్ధి అవుతాయి. తల్లిదండ్రులు ఎటువంటివారో పిల్లలు అటువంటివారుగా తయారౌతారు. కనుక, పిల్లలు మంచివారు కావాలంటే, అభివృద్ధికి రావాలంటే మొట్టమొదట తల్లిదండ్రులు సక్రమమైన మార్గాన్ని అనుసరించాలి. లేకపోతే కొంత వయస్సు వచ్చిన తరువాత ప్లిలలు తల్లిదండ్రుల మాట వినరు. పిల్లలు సరిగా లేరంటే అది తల్లిదండ్రులయొక్క దోషమే! తల్లిదండ్రులమధ్య అభిప్రాయ భేదాలు ఉండకూడదు. ఇద్దరూ ఏకంగా ఉండాలి. ఇద్దరూ చేరి ఒకే మాట మాట్లాడాలి. తల్లి ఒకటి చెబితే తండ్రి మరొకటి చెప్పటం మంచిదికాదు.

పిల్లలకు మొట్టమొదట సత్యాన్ని అనుసరించవలసినదిగా బోధించాలి. సత్యం ఒకటి ఉంటే చాలు, అదే అన్నింటికీ ఆధారం. 'సత్యానాస్తి పరో ధర్మః' సత్యమునుండి ధర్మము పుడుతుంది. ధర్మమునుండి శాంతి పుడుతుంది. శాంతినుండి ప్రేమ పుడుతుంది.

అప్పుడు అందరూ అహింస పాటిస్తూ ప్రశాంతంగా ఉంటారు. కనుక, దేశానికి శాంతి కావాలనుకుంటే మనం సత్యాన్ని అనుసరించాలి. సత్యమంటే ఏమిటి? 'మనస్యేకం వచస్యేకం కర్మణ్యేకం మహాత్మనాం'. మనసులో ఒకటి పెట్టుకొని, మాట మరొటి చెప్పి, క్రియ ఇంకొకటి చేస్తే అది అసత్యమౌతుంది. మీరు అటువంటి ఆర్టిఫిషియల్ లైఫ్ గడిపితే చాలా చెడిపోతారు. మీ హార్ట్‌లో ప్రేమను నింపుకోవాలి. మీరు ఏది చేసినా హృదయపూర్వకంగా చేయాలి. కాని, ఇప్పుడన్నీ ఆర్టిఫిషియల్ అయిపోతున్నాయి. చదువుకూడను ఆర్టిఫిషియల్‌గా మారిపోతున్నాది. ఎన్ని గ్రంథాలు చదివినా, ఎన్ని మంత్రాలు ఉచ్చరించినా, ఎంతసేపు ధ్యానం చేసినా అంతా ఆర్టిఫిషియల్! అది మంచిది కాదు. మీరు ధ్యానం చేస్తున్నామని కండ్లు మూసుకుంటారుగాని మీ మనస్సు ఇష్టము వచ్చినట్లు తిరుగుతూ ఉంటుంది. ఎమి ప్రయోజనం? కనుక, మొట్టమొదట మీ మనస్సును కంట్రోలు చేసుకోవాలి.

మన ఆలోచనలు ఎలాంటివో మన ఆచరణ అలాంటిదౌతుంది. కనుక, మొట్టమొదట మన ఆలోచనలను పవిత్రముగా పెట్టుకోవాలి. అప్పుడే సత్కర్మలను ఆచరించగలుగుతాము. సత్కర్మలను ఆచరించినప్పుడే మనకు సత్ఫలితాలు వస్తాయి. మనస్సు ఎక్కడెక్కడకో పోతుంటే దానివెంట మనం పోకూడదు. మనస్సు మన స్వాధీనంలో ఉండాలిగాని, మనం మనస్సుయొక్క అధీనంలో ఉండకూడదు. మనస్సు ఒక పిచ్చికోతి వంటిది. అది యిష్టమువచ్చినట్లు ఎగురుతుంటుంది. కాని, దానిని దైవమువైపు మరల్చినప్పుడు అది చాలా అణగిమణగి ఉంటుంది.

మీరు సూర్యునికి విరుద్ధంగా తిరిగినప్పుడు సూర్యుని లైటు మీ వైపు పడుతుంది. అప్పుడు మీ నీడ మీకంటె పెద్దదిగా ఉండి మీ ముందుకు పడుతుంది. మీరు సూర్యునివైపుకు తిరిగినప్పుడు మీ నీడ మీ వెనుకకు పడిపోతుంది. మాయను మీ నీడతో పోల్చవచ్చు. మీ మనస్సు భగవంతునివైపుకు త్రిప్పితే మాయ మీ వెనుకకు పడిపోతుంది. అట్లుకాకుండా మీ మనస్సు భగవంతునికి విరుద్ధంగా తిరిగితే మాయ మిమ్మల్ని లొంగదీసుకుంటుంది. మధ్యాహ్నంవేళ సూర్యుడు మీ తలపైకి వచ్చినప్పుడు మీ నీడ మీ పాదాలక్రింద పడిపోతుంది. అదేవిధంగా, మీ మనస్సును స్థిరంగా భగవంతునిపై నిలిపినప్పుడు మాయ పూర్తిగా అణగిపోతుంది. కనుక, మాయను జయించాలంటే మీరు మొట్టమొదట మీ మనస్సును భగవంతునివైపు మరల్చాలి.

గడియారంలో మూడు ముళ్ళుంటాయి. ఒకటి బిరబిరా తిరుగుతుంటుంది. అదే సెకన్ల ముల్లు. అరవై సెకన్లు అయినప్పుడు ఒక నిముషం అవుతుంది. అరవై నిముషములు అయినప్పుడు ఒక గంట అవుతుంది. అయితే, మనం గంటల ముల్లుకి ప్రాధాన్యత ఇస్తాముగాని, సెకన్ల ముల్లును పట్టించుకోము. సెకన్ల ముల్లు స్పీడుగా తిరుగుతూ ఉన్నప్పటికీ దానికి మనం విలువ యివ్వము. అదేవిధంగా మీరు ఉదయము, సాయంత్రము కొద్దిసేపు మాత్రమే భగవంతుని తలుచుకుంటే దానికి అంతగా విలువ ఉండదు. సర్వదా సర్వకాలేషు సర్వత్రా భగవంతుని స్మరిస్తూ ఉండాలి. అదే గంటల ముల్లు వలె చాలా ముఖ్యమైనది.

'మనయేవ మనుష్యాణాం కారణం బంధమోక్షయోః' మనస్సే బంధన తెప్పిస్తుంది. ఆ మనస్సే మనకు మోక్షము నందిస్తుంది. కనుక, మనస్సును మీరు సరైన రీతిలో పెట్టుకోవాలి. అప్పుడు మీకు తప్పకుండా ఏకాగ్రత కుదురుతుంది. సత్యముచేతను, ప్రేమచేతను మనస్సును పవిత్రం గావించుకోవాలి. ఎందుకంటే ఈ రెండే శాశ్వతమైనవి. ప్రేమయే సత్యము. కాబట్టి, ప్రేమలో జీవించండి. ప్రేమ అంటే స్పిరిచువల్ లవ్. దానిని భద్రంగా పెట్టుకున్నప్పుడు మనస్సుకు స్థిరత్వం కలుగుతుంది. లౌకికమైన ప్రేమ ప్రేమ కాదు. అది మనస్సును నిరంతరం చలింపజేస్తూ ఉంటుంది. కనుక, మీరు మీ మనస్సును నిరంతరం భగవంతునివైపుకే త్రిప్పి ఉంచండి. అప్పుడు మీకు శాంతి చిక్కుతుంది. ఇది చాలా కష్టమని అనుకుంటారు చాలామంది. కాని, అంతకంటె సులభమైనది మరొకటి లేదు. మనుస్స భగవంతునిపై లేనప్పుడు అది ఏమాత్రం కంట్రోలు కాదు. మీలో నిజంగా భగత్ప్రేమ అభివృద్ధి అయితే మీ మనస్సు సులబంగా కంట్రోలు అవుతుంది. మీరు ఏది చేసినా, ఏది చూచినా, ఏది చెప్పినా 'ఇదంతా భగవంతునియొక్క పని' అని అనుకోవాలి. ఏది జజరిగినా అది భగవత్సంకల్పమే. చెడు జరిగినా అది భగవత్సంకల్పమే. ఆ చెడుకూడా ఎందుకోసం యిచ్చాడో యేమో! 'సుఖదుఃఖే సమేకృత్వా లాభా లాభౌ జయా జయౌ' అన్నట్లుగా మీరు అన్నిటినీ సమచిత్తంతో అనుభవించాలి. ఆ డివైన్ లవ్‌ను అనుసరించినప్పుడు మీకు అన్నీ సక్రమంగా జరిగిపోతాయి.

ఈనాడు ప్రతి ఒక్కరూ లౌకికప్రేమను అనుసరిస్తున్నారు. భగవత్ప్రేమయే నిజమైన ప్రేమ. ఆ ప్రేమ ఎన్నడూ మీకు ద్రోహం చేయదు. ఎవరేమని అనుకున్నా, ఏవిధమైన విమర్శలు చేసినా పట్టించుకోకుండా మీలో ఆ భగవత్ప్రేమను భద్రంగా పెట్టుకున్నప్పుడు మీరు భవిష్యత్తులో మంచి అభివృద్ధికి వస్తారు. మీ దేహం ఒక బ్యాగువంటిది. ఇందులో మనస్సు, బుద్ధి, చిత్తము మొదలైనవాటిని పెట్టుకున్నారు. దేహంనుండి ప్రాణం పోతూనే ఇది ఖాళీ అయిపోతుంది. అప్పుడు దీనిని అగ్నిలో వేసి కాల్చివేస్తారు. కాబట్టి, ప్రాణం ఉండగానే మీలో ఉన్నటువంటి సరుకును భగవంతునికి అర్పితం చేయండి. కామ క్రోధ లోభ మద మాత్సర్యాలు మనకు బాధలు కలిగించేవేగాని ఆనందాన్ని అందించేవి కావు. వీటిని త్యజిస్తే ఎంత హాయిగా ఉంటారు మీరు. అప్పుడు మీలో నిలచి ఉండేది ఆనందమొక్కటే. అట్టి శాశ్వతమైన ఆనందాన్ని మీరు అనుభవించాలంటే మీలో ఉన్నదంతా భగవంతునికి అర్పితము చేయాలి. మీరు ఎన్నో కావాలని ఆశపడతారు. కాని, ఆశించినవన్నీ మీకు లభిస్తాయా? మీ ఆశలను నెరవేర్చుకొనే నిమిత్తం ఇతరులను బాధపెట్టకూడదు. మీకేమైనా కావాలనుకుంటే నేరుగా భగవంతుని అడగండి. భగవంతునితో మీరు నేరుగా సంబంధము

పెట్టుకోండి. భగవంతుని నేరుగా అడగకుండా లేనిపోని యితర మార్గాలను అనుసరిస్తే మీరు దుఃఖానికి గురికావలసివస్తుంది.

ఈనాడు మనకు ముఖ్యంగా కావలసినది యూనిటీ. ఆనాడు ప్రజలందరూ ఐకమత్యముతో పోరాడటంచేతనే భరతదేశము స్వాతంత్ర్యం సాధించగలిగింది. దీనిని పురస్కరించుకొని నేను ఆరోజుల్లో ఒక పాట వ్రాసాను. ఒకనాడు ఒక రాజకీయ నాయకుడు వచ్చి, 'బాబూ! నీవు మంచి కవిత్వము వ్రాస్తావుట. మన వీరులపైన ఒక మంచి పాట వ్రాస్తే మేము పేపర్లో వేసుకుంటాం' అన్నాడు. వాళ్లు ఒక సభ ఏర్పాటుచేసుకున్నారు. ఆ సభలో నేను వేదికమీద ఉయ్యాల తొట్టెలో ఒక రబ్బరు బొమ్మను పెట్టి ఊపుతూ ఒక పాట కూర్చి పాడాను.

ఏడువకు పసిబాల ఏడువకు తండ్రీ! ఏడిస్తే నిను భరతవీరుడనరయ్యా... జో...జో..  
హంతకుడు హిట్లరు అమర రష్యాపై దండెత్త వచ్చెనని జడిసి ఏడ్చితివా...జో...జో..  
హిట్లరును చంపుటకు ఎఱ్ఱసైన్యంబు వీరుడౌ స్టాలిను కలరు ఏడువకు.....జో...జో..  
ఇంకెందుకుర నాన్న అట్టులేడ్చెదవు ప్రజలకైక్యత లేదటంచు ఏడ్చితివా  
ఐక్యతగ ప్రజలంత చేరి పోరాడి స్వాతంత్యమును పొందగలరు ఏడువకు...జో...జో..

అందరూ ఏకం కావటంచేతనే దేశానికి స్వాతంత్ర్యం వచ్చింది. ప్రేమ ఒక్కటే అందరినీ ఏకంచేస్తుందిగాని , ద్వేషం ఎన్నటికీ చేయదు. చూడండి, ఈనాడు ఇక్కడ మీరందరూ చేరారు. మీ అందరికీ ఎవరైనా ఇన్విటేషన్ పంపించారా? లేదు, లేదు. ప్రేమ ఒక్కటే మీ అందరినీ ఇక్కడికి రప్పించింది. మీ ప్రేమ, నా ప్రేమ రెండూ చేరటంచేత మీరు యింతటి ఆనందాన్ని అనుభవించ గలుగుతున్నారు. ప్రేమచేత ఎంటి ఘనకార్యమునైనా సాధించవచ్చును. ఎట్టి రాక్షసుడినైనా జయించవచ్చును. హనుమంతుడు లంకకు వెళ్ళినప్పుడు సీత అశోకవనంలో ఒక వృక్షము క్రింద తలవంచుకొని కూర్చొని రామనామాన్ని జపిస్తున్నది. రాముడు తప్పకుండా వచ్చి తనను రక్షిస్తాడని ఆమె పరిపూర్ణంగా విశ్వసించింది, రాముడే తన సర్వస్వంగా భావించింది. భగవంతునిపట్ల మీరు అంతటి పరిపూర్ణమైన ప్రేమను, విశ్వాసాన్ని కలిగియుండాలి. రావణుడుకూడా గొప్ప విద్యావంతుడే! కాని, రాముని ముందు చిల్లిగవ్వకుకూడా సరిపోలడు. ఎందుకంటే, రాముడు శీలసంపన్నుడు. ఆ character ఒకటుంటే ఎంతైనా సాధించవచ్చు. అందువల్లనే మా పిల్లలకు చెబుతుంటాను, శీలమే విద్యయొక్క పరమావధి. శలమే లేకపోతే ఎన్ని చదువులు చదివినా ప్రయోజనం లేదు. చదవటం గొప్పతనం కాదు. మన హృదయంలో సద్గుణాలను ప్రతిష్ఠించుకోవాలి. మన మన character కరెక్టుగా ఉన్నప్పుడు అన్నిటిందు విజయం సాధిస్తాము.

ప్రేమస్వరూపులారా! మీరు మీ ఇళ్ళకు తిరిగి వెళ్ళిన తరువాత మీ పిల్లలలో మంచి character ను అభవృద్ధి పరుస్తూ, పవిత్రమైన కార్యాలు చేస్తూరండి. ఎంత డబ్బు సంపాదించి ఏ బ్యాంకులో పెట్టినప్పటికీ చిట్టచివరికి మీవెంట ఏమీ రాదు. కనుక, త్యాగానికి పూనుకోండి. పదిమంది బీదలకు సహాయం చేయండి. త్యాగభావముతో పవిత్రమైన కార్యాలు చేస్తూ మీ జీవితాలను గడిపితే మీరు ఎంతైనా ధన్యులౌతారు.